సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే వివేకానందకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యవర్గం

కుత్బుల్లాపూర్ : శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ (పారిశుద్ధ్య) సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ హామీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎస్ఎఫ్ఏ నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు చిట్యాల శివకుమార్, రవి ఆధ్వర్యంలో సోమవారం ఆయనను కలిసి తమ సమస్యలను విన్నవించగా సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా నియోజకవర్గానికి చెందిన పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు, నాయకులు కూడా కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లో సమస్యలను వివరించి పరిష్కరించాలని ఆదేశించారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్ నాశనం



ప్రతిజ్ఞ చేస్తున్న విజ్ఞాన కళాశాల విద్యార్థులు

నిజాంపేట్: డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్ నాశనం అవుతుందని బాచుపల్లి ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. నిజాంపేట్‌లోని విజ్ఞాన జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరదాగా డ్రగ్స్‌ను అలవాటు చేసుకుని ఎందరో తమ విలువైన జీవితాలను కోల్పోయారన్నారు. వాటికి దూరంగా ఉండడమే కాకుండా డ్రగ్స్ తీసుకుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, జార్జి ప్రసన్న, శ్రీనివాసరావు తదితరులు డ్రగ్స్ నిర్మూలనకు తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు చేశారు.

కావడి పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట : డివిజన్ పరిధిలోని శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కావడి పాదయాత్ర నిర్వహించారు. రింగ్‌బస్తీలోని శ్రీ మనోకామ్న హనుమాన్ ఆలయం నుంచి ఐడీపీఎల్ కాలనీ మీదుగా హెచ్ఎంటీ కాలనీలోని ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. యూపీ, ఎంపీ, బీహార్ తదితర రాష్ట్రాలకు చెందిన ప్రజలు యేటా శ్రావణమాసంలో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పాదయాత్రలో డివిజన్ కార్పొరేటర్ జగన్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సుభాష్‌నగర్: గాజులరామారం–దేవేందర్‌నగర్ మూలమలుపు ఎల్ఎన్ బార్ వద్ద ఆదివారం ఉదయం ఓ వ్యక్తి మితిమీరిన వేగంతో కారుతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడమే కాకుండా ఓ వ్యక్తి మృతికి కారణమయ్యాడు. ఈ ఘటనలో రెండు స్తంభాలు విరిగిపోవడంతో దేవేందర్‌నగర్‌కు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో ఏఈ చైతన్య భార్గవ్ సోమవారం ఉదయం నూతన స్తంభాలను అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వరదకు శాశ్వత పరిష్కారం



ఆర్‌కే లేఅవుట్‌లో పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దివాకర్

నిజాంపేట్: వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చేపేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ చిట్ల దివాకర్ అన్నారు. రెండో డివిజన్ పరిధి ఎస్ఆర్ఐ కాలనీ, ఆర్‌కే లేఅవుట్, చందు లేఅవుట్‌లలో రెండేళ్లుగా వరదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కౌన్సిల్ సమావేశంలో ఆయన మేయర్ దృష్టికి తీసుకెళ్లి రూ.99 లక్షల నిధులు మంజూరు చేయించారు. 90 ఎంఎం దయా వెడల్పుతో చేపట్టనున్న పైపులైన్‌ను ఎస్ఆర్ఐ కాలనీ నుంచి రాఘవేంద్ర బృందావన్ అపార్ట్‌మెంట్ వరకు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ పనులు పూర్తయితే వరద సమస్య తీరుతుందని పేర్కొన్నారు.

ఘన స్వాగతం పలుకుదాం

కుత్బుల్లాపూర్: మందకృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి ఈ నెల 13 న (నేడు) నగరానికి వస్తున్న నేపథ్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ఘనంగా స్వాగతం పలికేందుకు కులస్తులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మేడ్చల్ వైస్ ప్రెసిడెంట్ రాస మల్ల యాదగిరి మాదిగ సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటలకు కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ నుంచి భారీ ఎత్తున ర్యాలీగా తరలివెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలి



నిజాంపేట్: ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని నిజాంపేట్ కార్పొరేషన్ 26వ డివిజన్ కార్పొరేటర్ రాఘవేంద్రరావు కోరారు. డివిజన్‌కు చెందిన విజయ్ శ్రీనివాస్‌నగర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతుగా రూ.1.5 లక్షల విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ పూజారి, వంట గదుల నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు.



షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులో దుకాణాల ఎదుట బురద



షాపూర్‌నగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదుట అస్తవ్యస్తంగా చెత్తాచెదారం



గిరినగర్ నాలా సమీపంలో నిల్వ ఉన్న మురుగునీరు, చెత్త

పారిశుద్ధ్యంపై పట్టింపేది..?

ఎక్కడపడితే అక్కడే చెత్తాచెదారం

- రోడ్లపైనే రోజుల తరబడి వర్షాపు నీరు
- అధ్వానంగా పరిసరాలు, విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన ప్రజలు, పట్టని అధికారులు

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడపడితే అక్కడే చెత్తాచెదారం దర్శనమిస్తుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్లపై వరద నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తరలించేందుకు మాన్‌సూన్ సిబ్బందిని నియమించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో చర్యలు చేపట్టిన సర్కిల్ అధికారులు మరికొన్ని చోట్ల మాత్రం గాలికి వదిలేశారు. దీంతో రోడ్ల వెంబడి రోజుల తరబడి వర్షాపు నీరు నిల్వ ఉండి దోమల వృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయి. మూడు నెలలుగా గ్రేటర్ పరిధిలోకి వచ్చే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 271 పైచిలుకు డెంగీ కేసులు నమోదైనట్లు అధికార గణంకాలు చెబుతున్నా, వాస్తవ పరిస్థితుల్లో మాత్రం అంతకు మించి ఉన్నాయి. షాపూర్‌నగర్, కుత్బుల్లాపూర్, సూరారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు జంట సర్కిళ్ల పరిధిలోని బస్తీ దవాఖానాలకు నిత్యం పెద్ద సంఖ్యలో జ్వర పీడితులు క్యూ కడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల వెంటే వరద..

- ఐడీపీఎల్–జగద్గిరిగుట్ట రోడ్డులోని పలు చోట్ల ఇటీవల కురిసిన వర్షాలకు వరద చేరింది. అయితే నీరు వెళ్లేందుకు సరైనా మార్గం లేకపోవడంతో రోజుల తరబడి నిల్వ ఉంటున్నది. దీంతో అవి దోమల వృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయి. కొన్ని చోట్ల చెత్త వ్యర్థాలు వేస్తుండడం, అదే ప్రాంతంలో నీరు చేరడంతో మరింత దుర్వాసన నెలకొంటోంది. గిరినగర్ నాలా సమీపంలో, రంగారెడ్డినగర్‌లోని స్వామి వివేకానంద విగ్రహం సమీపంలో రోజుల తరబడి నీరు అలాగే ఉంటోంది.
- రంగారెడ్డినగర్‌లోని బస్తీ దవాఖానా పక్క గల్లీలో కొన్ని నెలలుగా డ్రైనేజీ లీకేజీతో పాటు వర్షాపు నీరు చేరడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఈ ప్రాంతంలో నిత్యం బురదమయంగా ఉంటోందని, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కానరానీ ఎంటమాలజీ సిబ్బంది



దేవేందర్‌నగర్‌లోని గాజులరామారం పీహెచ్‌సీలో జ్వరంతో బాధపడుతున్న వ్యక్తికి ఇంజక్షన్ ఇస్తున్న సిబ్బంది

జంట సర్కిళ్ల పరిధిలో దోమల నివారణకు ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది ఉన్నా ఫలితం లేకుండా పోతున్నది. రోడ్ల పక్కన నీటి నిల్వలపై దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ వేసిన దాఖలాలు కనిపించవు. అలాగే ప్రతిరోజు బస్తీలు, కాలనీల్లో ఫాగింగ్ చేయాల్సి ఉండగా అది కూడా అటకెక్కింది. 'ఫ్రైడే–డ్రైడే' కార్యక్రమం కేవలం ఫొటోలకు మాత్రమే పరిమితమవుతుందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

గాజులరామారం యూపీహెచ్‌సీలో 11 కేసులు..

దేవేందర్‌నగర్‌లోని గాజులరామారం యూపీహెచ్‌సీలో ఇప్పటివరకు 11 డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం. అంతేగాకుండా నిత్యం పదుల సంఖ్యలో జ్వరం, ఒళ్లు నొప్పులతో పలువురు ఆస్పత్రికి వస్తున్నట్లు తెలుస్తోంది. ఇక షాపూర్‌నగర్, కుత్బుల్లాపూర్, సూరారం కాలనీలోని యూపీహెచ్‌సీల్లో డెంగీ కేసుల వివరాలను వెల్లడించేందుకు అధికారులు జంకుతున్నారు.

షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డు, మార్కెట్ సమీపంలో..

షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులోని దుకాణాల ఎదుట మట్టి పేరుకుపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు బురదగా మారింది. అదేవిధంగా రైతు బజారు వెనుక గల్లీలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదుట చెత్త డంపింగ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నీరు చేరడంతో దుర్వాసనతో ముక్కు మూసుకోని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.ఇప్పటికైనా ఆయా విభాగాల అధికారులు రోడ్ల వెంబడి నీరు నిల్వ ఉండకుండా మట్టితో చదును చేయడం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సతీశ్ తదితరులు

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ధారదత్తం చేసేందుకు నిజాంపేట్ మేయర్ భర్త యత్నిస్తున్నారని బీజేపీ నాయకుడు ఆకుల సతీశ్ ఆరోపించారు. ఈ మేరకు మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ సర్వే నంబర్ 233/1లోని 4.19 ఎకరాల స్థలాన్ని 2020లో అప్పటి కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు కోర్టులో ఆరు కేసులు ఫైల్ చేశారన్నారు. స్థల విషయమై ఈ నెల 22న కోర్టులో తీర్పు ఉండగా, నిజాంపేట్ కమిషనర్ ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వెలువడేలా సహకరిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక మేయర్ భర్త చక్రం తిప్పుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. నాయకులు గొల్ల కృష్ణ, ప్రవీణ్, శ్రీనివాస్, కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పథంలో కార్పొరేషన్



మేయర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజలు

నిజాంపేట్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్–3 వాసులు సోమవారం మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీలు నిర్మించాలని మేయర్‌కు విన్నవించగా ఆమె సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు కేటాయించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీనిచ్చారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: సుచిత్రా అకాడమీ ఆరో వార్షికోత్సవం సందర్భంగా కొంపల్లిలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా అకాడమీ ప్రిన్సిపాల్ దీపా కపూర్ మాట్లాడుతూ సుచిత్రా ఎంయూఎన్ 6.0 కేవలం సదస్సు మాత్రమే కాదని, ఇది యువ నాయకుల నైపుణ్యాలు మెరుగుపరిచి, శాశ్వత స్నేహాలు ఏర్పరచుకుని, మెరుగైన ప్రపంచానికి దోహద పడే మార్గదర్శక వేదికగా నిలవాలని కోరుకుంటున్నామన్నారు. రెండో రోజు 'నో బ్యాగ్ డే' స్లోగాన్‌ను విద్యార్థుల దగ్గరకు చేర్చేందుకు గొప్ప వేదికన్నారు. అత్యుత్తమ ప్రదర్శనలు, ఉత్సాహపూరితమైన సామాజిక సమావేశానికి గుర్తింపుగా అవార్డులను ప్రకటించారు. కార్యక్రమంలో యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి, జాయింట్ క్రైసిస్ కమిటీ, హై లెవల్ పొలిటికల్ ఫోరం ఆన్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్, ఆల్ ఇండియా పొలిటికల్ పార్టీస్ మీట్, ఇంటర్నేషనల్ ప్రెస్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్, ఉన్నత స్థాయితో సహా పలు కమిటీల్లో పలు దేశాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న 290 మంది విద్యార్థులు చర్చల్లో పాల్గొన్నారు.

పగలే వెలుగు..!



చింతల్: భగవత్‌సింగ్‌నగర్‌లోని రోడ్డు నంబర్ 4, 30 గల్లీల్లో వారం రోజులుగా వీధి దీపాలు పట్టపగలే వెలుగుతూనే ఉన్నాయి. ఈ విషయాన్ని స్థానికులు ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అధికారులు వాటికి ఆన్.. ఆఫ్ బటన్లు ఏర్పాటు చేయకపోవడంతో నిరంతరం వెలుగుతూనే ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు రాత్రి సమయంలోనే వెలిగేలా చూసి విద్యుత్ ఆదా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సుభాష్‌నగర్ నుంచి కావడి యాత్ర

సుభాష్‌నగర్: సుభాష్‌నగర్ చెందిన బిహారీలు సోమవారం కావడి యాత్రను నిర్వహించారు. సుభాష్ నగర్ నుంచి కాలినడకన శివనామ స్మరణతో గాజులరామారం చిత్తరమ్మ దేవి ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణ చేశారు. అనంతరం సుభాష్‌నగర్‌కు వెళ్లారు. జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ సమీపంలోని శివాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కలశాలను శివుడికి సమర్పించారు.

త్వరలోనే రాజీవ్ గృహకల్ప ఎన్నికలు

జగద్గిరిగుట్ట: త్వరలోనే డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు స్థానిక కార్పొరేటర్ జగన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికిగాను ఎలక్షన్ స్టీరింగ్ కమిటీ సభ్యులుగా మల్లారెడ్డి, దాసు, విట్టల్ ముదిరాజ్‌ను నియమించారు. సుమారు ఆరేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడ్డాయి. త్వరలోనే ఎన్నికల నిర్వహణ తేదీని వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

నియామకం

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ మహిళా మోర్చా కన్వీనర్‌గా ముదునూరి నాగమణి నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కన్వీనర్ డా. ఎస్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ చేతుల మీదుగా సోమవారం నియామక పత్రం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని వారు పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జ్యోతి, కుత్బుల్లాపూర్ మండల సర్వేయర్

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ మండల సర్వేయర్‌గా జ్యోతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో హయత్‌నగర్ మండలంల పని చేసిన ఈమె ఇక్కడికి ట్రాన్స్‌ఫర్‌పై వచ్చారు. ఈ సందర్భంగా సర్వేయర్ జ్యోతి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ పరిధిలో ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రజావాణికి 21 ఫిర్యాదులు



డీసీ మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్ : జంట సర్కిల్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10: 30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ నరసింహ ఆధ్వర్యంలో జరిగిన ప్రజావాణిలో మొత్తం 13 ఫిర్యాదులు రాగా వాటిలో రెండు టౌన్ ప్లానింగ్, 8 ఇంజినీరింగ్, ఒకటి శానిటేషన్ విభాగానికి సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. వచ్చే ప్రజావాణి లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆయన లేఖలు రాశారు. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణికి 8 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ 5, ఎలక్ట్రికల్ ఒకటి, టౌన్ ప్లానింగ్ రెండు వాటిని ఆయా సంబంధిత అధికారులకు ఫార్వర్డ్ చేశారు. రెండు సర్కిళ్ల పరిధిలో జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రియల్ వ్యాపారిపై కేసు



కూల్చివేసిన ప్రహరీ

జగద్గిరిగుట్ట: ప్రహరీ కూల్చివేసిన ఘటనలో రియల్ వ్యాపారిపై జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం సర్వే నంబర్ 298లో ఎకరానికి పైగా స్థలం ఉప్పల శ్రీనివాస్, ఇతరుల పేర్లపై ఉన్నది. చుట్టుపక్కల వారు.. ఇబ్బందులకు గురి చేస్తుండడంతో 2019లో ఏడీ సర్వే చేసి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఈ నేపథ్యంలో 2017 నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారి యాదగిరిరెడి శ్రీనివాస్‌కు సంబంధించిన స్థలంలో తనకు ప్లాట్లు ఉన్నాయని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈనెల 2 న ఉదయం 11:30 సమయంలో స్థలం వద్దకు తన అనుచరులతో కలిసి వచ్చి ప్రహరీని కూల్చివేశాడు. ఈ విషయంపై శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి రియల్ వ్యాపారి యాదగిరిరెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో కేసు నమోదు కాగా.. తాజాగా రియల్ గొడవ నేపథ్యంలో యాదగిరిరెడ్డిపై రెండో కేసు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరగడం గమనార్హం.

సీడీ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్ : నల్ల పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ ఆలయ విగ్రహ పున ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని తయారుచేసిన సీడీని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజులరామారంలో ఉన్న ఈ ఆలయం ఎంతో ప్రతిష్ఠాత్మకమైనదని, పున ప్రతిష్ఠాపన చేసేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు..

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సూరారం మెయిన్ రోడ్‌లో ఏర్పాటుచేసిన జై భవానీ టిఫిన్ సెంటర్‌ను ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు రమేశ్ గౌడ్, బుచ్చిరెడ్డి ఉన్నారు.



సీడీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

రిజర్వాయర్ మరమ్మతుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీజీఎం రవి, సెక్షన్ మేనేజర్లు

చింతల్: షాపూర్‌నగర్ వాటర్‌వర్క్స్ కార్యాలయ ఆవరణలోని జీఎల్ఎస్ఆర్ రిజర్వాయర్ మరమ్మతు పనులను షాపూర్‌నగర్ సబ్ డివిజన్ డీజీఎం రవి సోమవారం పరిశీలించారు. శిథిలామైన రిజర్వాయర్ పైకప్పు పనులు త్వరగా పూర్తిచేసే తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట గాజులరామారం సెక్షన్ మేనేజర్ రోహిణి, షాపూర్‌నగర్ సెక్షన్ మేనేజర్ రమ్యభారతి ఉన్నారు. కాగా సోమవారం కుత్బుల్లాపూర్ వాటర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం ఆరు ఫిర్యాదులు రాగా డీజీఎంలు రాజేశ్ , వికాస్, సెక్షన్ మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న పద్మాలతారెడ్డి

జీడిమెట్ల: హరిహర కళాభవన్‌లో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సంఘ సేవలకు ఆదివారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా చాలా ఏళ్లుగా జీడిమెట్ల సుభాష్‌నగర్‌కు చెందిన సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మాలతారెడ్డి అనాథ పిల్లలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నది. ఆమె సేవలను గుర్తించిన ఫౌండేషన్ వారు మదర్ థెరిసా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డు రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



పాఠశాలలో ఏర్పాటైన క్రమశిక్షణ మండలి

జీడిమెట్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణతో మెలగాలని ఎంపీఈడీఎల్ రత్నాకర్‌రెడ్డి అన్నారు. అపురూపాకాలనీలోని టీవీఆర్ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన క్రమశిక్షణ మండలి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్‌ బాయ్, హెడ్‌గర్ల్, డిప్యూటీ హెడ్‌బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్స్‌ను ఆయన శ్లాసెస్‌సెస్‌లతో సత్కరించారు. అనంతరం విద్యార్థులనుద్ధేశించి మాట్లాడుతూ క్రమశిక్షణ మంచి లక్షణాలు ఉన్న విద్యార్థులకు సమాజంలో మంచి గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ వంశీరెడ్డి, పీఈటీ లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

జగద్గిరిగుట్ట : మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం 'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆ జిల్లా కన్వీనర్ ఎస్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ హాజరై జెండా ఊపి ప్రారంభించారు. షాపూర్‌నగర్ చౌరస్తా నుంచి ఐడీపీఎల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి స్వప్న, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సుధా పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట అలివేలు, స్థానిక బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు డివిజన్ అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్‌లైన్ల నిర్వహణ నేపథ్యంలో ఈ నెల 13న (నేడు) కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మల్లంపేట్, ఏసీ టైర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెయిన్‌బో కాలనీ, బ్లాక్‌డైమాండ్ కాలనీ, ప్రణీత్ జెన్నిత్, బాచుపల్లి సిగ్నల్స్ నుంచి అంగరా హోటల్ వరకు, దేవీ హోమ్స్, అదేవిధంగా 11కేవీ శ్రీ హోమ్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు కేఆర్‌సీఆర్ కాలనీ, క్రాంతినగర్ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029